క్లుప్తంగా

వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే కొఠారు



తిరుమలలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. రైతులకు ప్రకృతి సహకరించాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని, రానున్న కాలంలో ప్రజలందరికీ మరింత మేలు జరగాలని స్వామివారిని కోరుకున్నట్టు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వివరించారు.

ఘనంగా సీతారామస్వామి ఆలయ వార్షికోత్సవం



కొత్తపల్లి రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

దెందులూరు: మండలంలోని కొత్తపల్లిలో పట్టాభి సీతారామస్వామి ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, సీతారామ, ఆంజనేయస్వామిలకు వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోరాట యోధుడు అల్లూరి



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదవేగి : బ్రిటీష్ పాలకుల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన అల్లూరి సీతారామరాజు ఎప్పటికీ చైతన్య స్ఫూర్తిగా నిలుస్తారని చక్రాయగూడెం టీడీపీ నాయకుడు దొర్రాజు శ్రీనివాసరాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దొర్రాజు అన్నవరం, చల్లారి కోటేశ్వరరావు, కొనకళ్ళ వెంకట కృష్ణారావు, రాజుబోయిన నాగబాబు, దొంగల రామయ్య పాల్గొన్నారు.

యువతకు అల్లూరి స్ఫూర్తి

గణపవరం: దేశం గర్వించదగిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు యువతకు స్ఫూర్తి అని పలువురు అన్నారు. ఆదివారం అల్లూరి వర్ధంతి సందర్భంగా గణపవరంలో ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. నంద్యాల రామలింగరాజు, ఇంటి ఉదయభాస్కర్, కొండవీటి సూర్యనారాయణ నివాళులర్పించారు. అర్ధవరంలో కులవివక్ష వ్యతిరేక పోరాటసమితి ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణపవరం, జగన్నాథపురంలో అల్లూరి విగ్రహం వద్ద నాయకులు నివాళులర్పించారు.

12 నుంచి హనుమజ్జయంతి

పెదపాడు: స్థానిక బళ్లరేవుతూము సెంటర్‌లోని అభయాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఈనెల 12 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. 12న పంచామృత అభిషేకం, తమలపాకులతో పూజ, హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహిస్తామన్నారు. 13న ప్రత్యేక పూజలు, 14న పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేకాట, కోడిపందేల స్థావరాలపై దాడి

పెదవేగి : పేకాట, కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం లక్ష్మణ్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం న్యాయంపల్లిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,310 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అనంతరం పినకడిమిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2,100 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గణపవరం: ఈనెల 8వ తేదీ సోమవారం దువ్వ, ఉండి విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా గణపవరం మండలంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 12 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన వేదికలు

- నేటి నుంచి 33 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాలు
- గ్రంథాలయ బాట పట్టిన విద్యార్థులు



ఉంగుటూరు గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



భీమడోలులో వేసవి విజ్ఞాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ చేస్తున్న బాలబాలికలు, పెద్దలు, యువకులు

ఉంగుటూరు: విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆటపాటలతో, సరిపెట్టుకోకుండా విజ్ఞానం పెంచుకోవడానికి గ్రంథాలయ బాట పట్టారు. గ్రంథాలయ శాఖ 33 రోజుల పాటు ప్రత్యేక(వేసవి శిబిరాలు) కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దీంతో ఉంగుటూరు శాఖ గ్రంథాలయానికి పాఠకుల సంఖ్య పెరిగింది. వివిధ కళాశాలల్లో చదివే విద్యార్థులతో పాటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు గ్రంథాలయంలో దిన పత్రికలతోపాటు, వార పత్రికలు, వివిధ రకాల కథల పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు చదువుతున్నారు. ఈనెల 8నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు గ్రంథాలయాల్లో ప్రభుత్వం నిర్వహించనుంది. పిల్లలతో డ్రాయింగు వేయించడం, కథలు చదవడం, చెప్పించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమడోలు: వేసవి విజ్ఞాన శిబిరాలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం భీమడోలు శాఖా గ్రంథాలయంలోని బాలబాలికలు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 10 నుంచి 15 ఏళ్లలోపు వారంతా విధిగా శాఖాగ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలంటూ వారంతా నినాదాలు చేసారు. గ్రంథాలయాలే ముద్దు సెల్‌ఫోన్లు వద్దు అంటూ వారంతా నినదించారు. ఈనెల 8వ తేదీ సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు గ్రంథాలయాల్లో నిర్వహించే ఈ విజ్ఞాన తరగతులను వేదికలుగా వినియోగించుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని, ప్రతి రోజు 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు నిర్వహిస్తామని గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ తెలిపారు. పూళ్లలో వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్లను సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ ఆవిష్కరించారు. గుండుగొలనులో సర్పంచ్ కూర్మా లక్ష్మీ రాజ్‌కుమార్, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజులు ప్రారంభిస్తారని గ్రంథపాలకురాలు జి.నాగమణి తెలిపారు. తొలుత శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని భీమడోలు శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కడగల సత్యనారాయణ, సూర్యనారాయణ, చిన్నారులు, యువకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెదవేగి గ్రంథాలయంలో..

పెదవేగి : పెదవేగిలోని శాఖాగ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని గ్రంథపాలకుడు తోట అరుణకుమార్ తెలిపారు. నెలరోజులపాటు నిర్వహించనున్న ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు విజ్ఞానదాయకమైన అంశాలను వివరిస్తామని చెప్పారు. విద్యార్థులు వేసవి సెలవులను సక్రమంగా వినియోగించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించి, చిన్నారులను గ్రంథాలయానికి పంపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మంచి కార్యక్రమం



విద్యార్థులు విజ్ఞానవంతులుగా మారడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయి. గతంలో 20 మంది విద్యార్థులు వచ్చేవారు. వేసవి సెలవుల కారణంగా గ్రంథాలయానికి 50మంది విద్యార్థులవరకూ వస్తున్నారు. నెలరోజుల పాటు సాగే వేసవి శిబిరాలు విద్యార్థులకు మరింతగా ఉపయోగపడతాయి. – గంగాధరరావు, గ్రంథాలయ పాలకుడు, ఉంగుటూరు

విజ్ఞానం పెరుగుతుంది



గ్రంథాలయానికి వచ్చి ఎన్నో విజ్ఞానవంతమైన పుస్తకాలు చదువుతున్నాను. పుస్తక పఠనం ద్వారా చదవడం అలవడుతుంది. విజ్ఞానం కూడా పెరుగుతోంది. పాఠశాలకు సెలవులు ఇచ్చినప్పటి నుంచి గ్రంథాలయానికి రావడం ప్రారంభించాను. వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని అనేక నూతన అంశాలను నేర్చుకుంటాను.

– డి. భవ్యశ్రీ, 10వ తరగతి, ఉంగుటూరు

మహిళా సమస్యలపై పోరాటం

ఏలూరు రూరల్: నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, నియంత్రణపై పోరాటం చేస్తామని విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మీ అన్నారు. పెరుగుతున్న ధరలు, మహిళల అవస్థల అంశంపై ఆదివారం ఏలూరు సీపీఐ జిల్లా కార్యాలయంలో మహిళల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, గ్యాస్ సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని, దీంతో ధరలు పెరిగి మధ్య, పేద తరగతి మహిళలు అవస్థలు పడుతున్నారని దుయ్యబట్టారు. మహిళ సమాఖ్య జిల్లా కన్వీనర్ కొండేటి బేబీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అస్తవ్యస్థ విధానాల వల్ల ప్రజల జీవన విధానం అధోగతి పాలైందన్నారు. ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల వల్ల కలిగే దుష్పరిణామాలు ఉన్నత వర్గంపై కాకుండా పేదలపై పడిందని ఐద్వా కన్వీనర్ హైమావతి ఆరోపించారు. పాలకుల బుద్ధి, పాలనలో మార్పు రావాలంటే పోరాటాలే శరణ్యమని పలువురు సూచించారు. దీన్ని గుర్తించి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని ప్రకటించారు. సమావేశంలో ఉప్పులూరి లక్ష్మీ, భవాని, గొర్లి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చాటపర్రులో విజ్ఞాన శిబిరం

ఏలూరు రూరల్ : ఈ నెల 8 నుంచి జూన్ 16 వరకూ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చాటపర్రు గ్రంథాలయ నిర్వాహకురాలు కె.వాసుకి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కొనసాగే శిబిరంలో నీతి కథలు వినడం, చదవడం, చిత్రలేఖనం, చదరంగం, స్పోకెన్ ఇంగ్లీష్, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. విద్యార్థులందరూ పాల్గొనవచ్చన్నారు.

ప్రజాసాధికారతే ప్రభుత్వ లక్ష్యం



అర్ధవరంలో 150వ రోజు గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ప్రజాసాధికారతే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పారదర్శకంగా సుపరిపాలన అందిస్తున్నారని, ఈ ప్రభుత్వానికి మీ అందరి అండదండలు ఉండాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు ఆదివారం సాయంత్రం గణపవరం మండలం అర్ధవరంలో 150వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుబాబును వైఎస్సార్ సీపీ నాయకుడు నంబూరి ప్రతాప్‌వర్మ ఇంటి వద్ద పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. వాసుబాబుకు పూలకిరీటం అలంకరించి సన్మానించారు. ఎంపీపీ అర్ధవరం రాము నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వాసుబాబుపై పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 150 రోజులు నిర్విరామంగా విజయవంతంగా పూర్తి చేసుకోవడానికి సహకరించిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆయా కుటుంబాలకు అందించిన పథకాల లబ్ధిని వివరించారు. అన్ని వర్గాల ప్రజల కోసం పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని ఎంపీ కోటగిరి కోరారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి గత నాలుగేళ్లలో అందిన పథకాల లబ్ధి వివరించారు. సంబంధిత వివరాల బ్రోచర్‌ను అందజేశారు. పలుచోట్ల మహిళలు వాసుబాబుకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. నియోజకవర్గ పరిశీలకుడు వేండ్ర వెంకటస్వామి, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి బాబులు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, ఎంపీటీసీ సభ్యుడు దత్తాడ సుభాష్, సర్పంచ్ గాతల సుజాత, ఉపసర్పంచ్ భాస్కరరాజు, పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు





గుండుగొలనులో పూజలందుకుంటున్న స్వామి వారు, అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

భీమడోలు: గుండుగొలనులో దేవదాయ ధర్మశాఖ పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి. ఆలయంలో శనివారం రాత్రి ఉభయదేవేరులతో ద్వాదశ కోవెల ప్రదక్షణలు చేసారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి.శంకరరావు, ఆలయ మాజీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఆలయ పూజారి మంగపతి అచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కురవడంతో ఆలయంలో జరగాల్సిన అన్నసమారాధన కార్యక్రమాన్ని గ్రామంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ వగ్వాల భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెదనిండ్రకొలను జెడ్పీపాఠశాలలో కలుసుకున్న 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



కైకరంలో కలిసిన పూర్వవిద్యార్థులు



దెందులూరు గారపాటి హైమావతి పాఠశాలలో కలిసిన 1993-94 పదవ తరగతి విద్యార్థులు

నిడమర్రు: పెదనిండ్రకొలను జెడ్పీస్కూల్లో 2001-02 పదవ తరగతి టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. తమకు విద్యాబుద్దులు చెప్పిన నాటి 14 మంది గురువులను వారు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆ పాఠశాల అనుబంధంగా ఉన్న గత స్మృతులను నెమరువేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాలలో కలియ తిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. నాడు 2001-02 బ్యాచ్‌లో 130 మంది విద్యార్థులకు 115 మంది ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా హాజరవ్వడం ఆనందంగా ఉందని వారంతా సంతోషం వ్యక్తం చేసారు. బాల్య స్నేహితులతో సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ సమ్మేళనంను ఆ బ్యాచ్ విద్యార్థులు దంగేటి సత్యనారాయణ, గంటసాల బాలాజీ, నంబూరి శివకుమార్, అల్లాడి రాంబాబు, అల్లాడి భీమశకరం పర్యవేక్షించారు.

ఉంగుటూరు: కై కరం జిల్లా పరిషత్తు హైస్కూల్లో 2002వ బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం కైకరం నాగ సూర్య కన్వెన్షన్ హాల్లో కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలు గుర్తు తెచ్చుకున్నారు. రెండు దశాబ్దాలు తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఈ సందర్భంగా ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు. ఆనాటి బ్యాచ్‌కి చెందిన గంధం వెంకట్రావు, గౌస్, లక్ష్మణరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దెందులూరు: ఎంత ఉన్నత స్థానాల్లో ఉన్నప్పటికీ చదువుకున్న పాఠశాలను, చదువు చెప్పిన ఉపాధ్యాయులను జన్మభూమిని మరువరాదని డీప్ రూట్స్ పాఠశాలల సంస్థల అధినేత కొండా పావులూరి శేషుకుమార్ చౌదరి అన్నారు. ఆదివారం దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను పూర్వ విద్యార్థులంతా సత్కరించి గత స్మృతులను నెమరవేసుకున్నారు. అందరికీ విద్య అందించిన పాఠశాల అభివృద్ధికి ఆర్థికంగా సహకారం అందించాలని తీర్మానం చేశారు. ఆత్మీయ సమ్మేళనంలో కాళిదాసు గంగాధరరావు, వీరయ్య, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

చేబ్రోలులో నేడు గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: గడపగడపకు మన ప్రభుత్వం 151వ రోజు సోమవారం చేబ్రోలులో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికార్లు హాజరు కావాలని మంగరావు కోరారు.

10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెదపాడు: ఈనెల 10న పెదపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్.నిర్మలజ్యోతి తెలిపారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అందరు సభ్యులు,అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కొయ్యలగూడెం : రాజవరం పంచాయతీ గంగవరం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్, రైతు నాయకులు కంచర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ కొండేపాటి చింతయ్య కార్యక్రమానికి హాజరై సిబ్బందితో కలిసి రైతులకు విత్తనాలను సరఫరా చేశారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు ప్రభుత్వం ద్వారా అందించాల్సిన సహాయ సహకారాలు సకాలంలో అందుతున్నాయన్నారు. 50 మందికి సరిపడా విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని సిబ్బంది తెలిపారు. గ్రామ వ్యవసాయ సలహామండలి సభ్యుల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలిగి, పిల్లిపెసర్లు పంపిణీ చేశారు. ఆర్‌బీకే గ్రామ సచివాలయ సెక్రెటరీ కె.అచ్యుత్ కుమార్, ఈడుపుగంటి తాతారావు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం పూళ్ల చెరువు సుందరీకరణ పనులు



పూళ్లలో చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే వాసుబాబు, ఈడా చైర్‌పర్సన్ ఈశ్వరీ బలరామ్

భీమడోలు: పూళ్లలోని బావివీధి చెర్వును సుందరీకరణ చేసి ప్రజలందరికీ సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఈడా పరిధిలోని పూళ్లలో పురాతన చెరువుగా గుర్తింపుపొందిన బావివీధి చెరువును అభివృద్ధిపర్చేందుకు ఏలూరు డెవలప్‌మెంట్ అథారిటీ (ఈడా) మంజూరు చేసిన రూ.50లక్షలు, రివిట్‌మెంట్‌కు మరో రూ.5లక్షలు, గ్రామస్తుల భాగస్వామ్యం రూ.5లక్షలతో పార్కు, ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఈడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరీ బలరామ్‌తో కలిసి ఆదివారం ఎంపీ శ్రీధర్ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధికి సంబంధించిన మ్యాప్‌ను ఎమ్మెల్యే వాసుబాబు పరిశీలించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుబాబు సహాయ సహకారాలతో ఈడా చైర్‌పర్సన్ ఈశ్వరీ బలరామ్ అవసరమైన నిధులు వెచ్చించి చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవడం సంతోషదాయమన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ పూళ్ల గ్రామం మధ్యలో బావివీధి చెరువు అభివృద్ధి ద్వారా గ్రామస్తులకు ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. వాకింగ్ ట్రాకింగ్, ఫెన్సింగ్, విద్యుద్దీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరీ బలరామ్ మాట్లాడుతూ చెరువును అభివృద్ధి చేయడమే ఈడా లక్ష్యమన్నారు. అనంతరం వారిని డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీటీసీ గొండు కృష్ణ చైతన్య, ఎఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, నాయకులు కేతినీడి విశ్వేశ్వరరావు, పుప్పాల రామ్మోహనరావు, పుప్పాల బుజ్జులు, యాసా చిట్టియ్య, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, ఈడా ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనకు ప్రజా దీవెనలు

నిడమర్రు: ముఖ్యమంత్రిగా వైస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల నుంచి మద్దతు పెరుగుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం పెదనిండ్రకొలనులో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీకి చెందిన సీనియర్ నాయకులు కోటి నరసింహారావు ఆయన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, ఎంపీటీసీ చినిమిల్లి నరిసింహమూర్తి, వైస్ ఎంపీపీ బండి రమణ విస్సాకు, సొసైటీ అధ్యక్షుడు దాట్ల శివవర్మ, మాజీ సొసైటీ అధ్యక్షుడు చినిమిల్లి శ్రీను, వేగేశ్న వెంకటసుబ్బరాజు, సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, ఆర్‌బీకే చైర్మన్ దాసరి సురేష్, సచివాలయ కన్వీనర్ కోటి గోవింద్, నీటి సంఘం అధ్యక్షుడు అల్లాడి అబ్బులు, అల్లూరి వాసు తదితరులున్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే వాసుబాబు

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఎమ్మెల్యే వాసుబాబు ఆదివారం ఉదయం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. అలాగే స్వామివారి ప్రసాదాలను అందజేశారు.